

ప్రభుత్వాల ఆర్థిక విధానాలతోనే..

ప్రభుత్వాల విధానాలతోనే నిరుద్యోగం పెరుగుతోందని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. 10లో



అటు కాంగ్రెస్ .. ఇటు బీజేపీ!

ఉమ్మడి ఖమ్మం జిల్లాపై కాంగ్రెస్, బీజేపీ ప్రత్యేక దృష్టి సారించాయి. వచ్చే ఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహాలు రచిస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
43° / 29°

వాతావరణం

జిల్లాలో బుధవారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గంటగంటకూ ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రదర్శన..




ర్యాలీ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది, అర్చకులు

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది అవతరణ వేడుకల్లో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ దేవస్థానం ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ప్లాస్టిక్ రహిత భద్రాద్రి, దేవస్థానంగా మార్చేందుకు భక్తులు, స్థానికులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పండితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి ఆస్పత్రికి ముస్కాన్ అవార్డు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ముస్కాన్ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు నేషనల్ హెల్త్ మిషన్ సంయుక్త కార్యదర్శి విశాల్ చౌహాన్ మే 26న రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించగా, ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏప్రిల్ 21, 22 తేదీల్లో కేంద్ర ముస్కాన్ బృందం సభ్యులు ఈ ఆస్పత్రిని సందర్శించి ఎస్ఆర్సీ, ఎస్ఎన్‌సీయూ, పీడియాట్రిక్, ఓపీడీ సేవలను పరిశీలించారు. అవార్డుకు ఎంపికైనందున ఏడాదికి రూ.12లక్షల చొప్పున మూడేళ్ల పాటు రూ.36 లక్షలు అందుతాయని, వీటిని పిల్లలవార్డు అభివృద్ధికి కేటాయిస్తారని తెలిసింది. అవార్డు దక్కడం పట్ల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, పీడియాట్రిక్ నోడల్ అధి కారి, ఆస్పత్రి ఆర్ఎంఓ రాజశేఖర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అవార్డుకు ఎంపికయ్యేలా కృషి చేసిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ ఆస్పత్రి లక్ష్య అవార్డుకు కూడా ఎంపిక కానున్నట్లు సమాచారం.

ఎన్నికల వేళ.. అసమ్మతి గోల



ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ


బానోత్ హరిసింగ్

ఇల్లెందు అభివృద్ధిపై ఎమ్మెల్యే హరిప్రియ మార్క్

- పార్టీ వ్యవహారాల్లో ఆమె భర్తదే పైచేయి
- హరిసింగ్ వైఖరితో పార్టీకి చిక్కులు
- ఇప్పటికే పార్టీని వీడిన కొందరు నేతలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు నియోజకవర్గానికి రూ.700 కోట్ల నిధులు తీసుకురావడం, బస్‌డిపో, సివిల్ ఆస్పత్రి అప్‌గ్రేడ్, సీతారామ ఎత్తిపోతల పథకంలో తిరిగి చోటు, నేషనల్ హైవే.. ఇలా అనేక అభివృద్ధి పనులు చేపట్టడంలో ఎమ్మెల్యే హరిప్రియానాయక్ చేస్తున్న కృషి పట్ల సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. ఇదే సమయంలో నియోజకవర్గంలో పార్టీ పెద్దగా గులాబీ కేడర్‌ను ఒక్కతాటిపై నడిపించడంలో ఆమె వెనుకబడిపోతున్నారనే విమర్శలూ వస్తున్నాయి. ఇందుకు హరిప్రియ భర్త, ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హరిసింగ్ వ్యవహార శైలే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వేదికగా ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలన్నింటిలోనూ ఆయన మితిమీరి జోక్యం చేసుకుంటున్నారనే ప్రచారం రోజురోజుకు పెరుగుతోంది. పార్టీలో తన మాటకు ఎదురులేకుండా ఉండేందుకు వీలుగా గ్రూప్ రాజకీయాలను పెంచి పోషిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఒక్కొక్కరుగా నేతలు, వారి అనుచరులు 'కారు' దిగి వెళ్తున్నారనే అభిప్రాయం పార్టీ శ్రేణుల నుంచి బలంగా వినిపిస్తోంది. మరికొందరు ఇప్పుడు ఎమ్మెల్యే హరిప్రియ వెంట ఉంటూనే పంటి బిగువున నొప్పి భరిస్తున్నారని, సరైన సమయం వస్తే తిరుగుబాటు జెండా ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

- కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన 200 కుటుంబాలు ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశాయి. వీరంతా డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు నేతృత్వంలో తమ రాజకీయ కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. వీరు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించబోయే నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు.
- ఇల్లెందు పట్టణంలో బలమైన కేడర్ ఉన్న నేతగా మడత వెంకట్ గౌడ్‌కు పేరుంది. సుదీర్ఘ కాలం ఆయన కాంగ్రెస్‌లో కొనసాగారు. తెలంగాణ వచ్చిన తర్వాత తన భార్య, అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ మడత రమ, మరో 17 మంది కౌన్సిలర్లతో కలిసి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారి పదవీ కాలం ముగిసిన అనంతరం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మడత వర్గానికి సముచిత స్థానం దక్కలేదు. దీంతో ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్ నిర్ణయాలకు వ్యతిరేకంగా రెబల్ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిపిన మడత.. పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. గత మూడేళ్లుగా ఆయన స్తబ్దుగా ఉన్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికలకు నాలుగైదు నెలల సమయం ఉందనగా వెంకట్‌గౌడ్ రాజకీయంగా మరోసారి క్రియాశీలకంగా మారారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు వేదికగా తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకుంటానంటూ వరుసగా ప్రకటనలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో బొడ్రాయి పండుగ అంశంపై ఏకపక్ష నిర్ణయాలు జరగకుండా అడ్డుకట్ట వేయగలిగారు. రానున్న రోజుల్లో మరింత వేగంగా ఎమ్మెల్యే, ఆమె భర్త పట్ల అసంతృప్తిగా ఉన్న నేతలను ఒక్కతాటిపై తెచ్చే పనిలో మడత ఉన్నారనే ప్రచారం జరుగుతోంది.
- నియోజకవర్గ కేంద్రమైన ఇల్లెందు మున్సిపాలిటీలో కౌన్సిలర్లు రెండు వర్గాలుగా చీలిపోయి ఉన్నారు. గత ఆరు నెలలుగా ఈ రెండు వర్గాల మధ్య ఉప్పు – నిప్పు అన్నట్టుగా పరిస్థితి ఉంది. ఎంత పోరాటం చేసినా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లును అసమ్మతి వర్గం గద్దె దించలేకపోయింది. ఇదే సమయంలో మున్సిపల్ పాలనపై పట్టు చిక్కకుండా చైర్మన్‌ను నియోజకవర్గ పార్టీ పెద్దలు పదే పదే ఇబ్బందులకు గురి చేశారనే అనుమానాలు డీవీ వర్గంలోనూ నాటుకున్నాయి. దీంతో ఇల్లెందు పట్టణంలో బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నేతల్లో అసంతృప్తి గూడుకట్టుకుపోతోంది. వీరి వెనుక ఉన్న కేడర్‌లో సైతం గందరగోళం నెలకొంది. ఇలా ఇల్లెందు పట్టణంలో అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా రగులుతోంది.
- ఇక మహబూబాబాద్ జిల్లా పరిధిలో ఉన్న గార్ల, బయ్యారం మండలాల్లో హరిసింగ్ వ్యవహార శైలితో విసిగి వేసారిపోయిన అసమ్మతి నేతలు ఇప్పటికే మహబూబాబాద్ ఎంపీ కవితను ఇల్లెందు నుంచి బరిలో దించాలంటూ పార్టీ పెద్దలకు మొర పెట్టుకున్నారు. ఇంకొందరు మరో అసమ్మతి నేత కోరం కనకయ్య గ్రూపులో కొనసాగుతున్నారు.
- టేకులపల్లి మండలంలో లక్కినేని సురేందర్ బలమైన నేతగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడిగా ఆయనకు పేరుంది. తెలంగాణ వచ్చిన తర్వాత మారిన రాజకీయ సమీకరణాల్లో అప్పటి ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటే కాంగ్రెస్‌ను వీడి నాటి టీఆర్ఎస్‌లో చేరారు. ఆ తర్వాత హరిప్రియా నాయక్ సైతం కాంగ్రెస్‌ను వీడి టీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు వేదికగా తనకు చిక్కులు ఎదురయ్యాయని లక్కినేని అనేక సందర్భాల్లో వెల్లడించారు. దీంతో లక్కినేని బీఆర్ఎస్‌ను వీడి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు.



హోంగార్డుల సేవలు మరువలేనివి : ఎస్పీ

మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

కొత్తగూడెంటౌన్: జిల్లాలో హోంగార్డు ఆఫీసర్స్‌గా పనిచేస్తూ అనారోగ్య సమస్యలతో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరణించిన హోంగార్డుల సేవలు మరువలేనివని కొనియాడారు. వారి కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్ఐ సుధాకర్‌రావు, ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాస్, హోంగార్డ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మరణించిన హోంగార్డుల కుటుంబసభ్యులతో ఎస్పీ వినీత్ తదితరులు

పరిశ్రమల ఏర్పాటుకు స్వర్గధామం



కేటీపీఎస్ సీఈలను సత్కరిస్తున్న విప్ రేగా, ఎమ్మెల్యేలు వనమా, హరిప్రియ, కలెక్టర్ అనుదీప్

- జిల్లాలో అపార అవకాశాలు ఉన్నాయి
- ఔత్సాహికులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- విప్ రేగా కాంతారావు

పాల్వంచ : ఔత్సాహిక యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి జిల్లా స్వర్గధామం వంటిదని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నా రు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నవభారత్‌లో పారిశ్రామిక ప్రగతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటుకు ముందు పరిశ్రమలు స్థాపించాలంటే కార్యాలయాల చుట్టూ, బ్యాంక్‌ల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు 15 రోజుల్లోనే అనుమతి ఇస్తున్నారని తెలిపారు. టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియ సులభతరం కావడంతో పలువురు ముందుకొస్తున్నారని చెప్పారు. పెట్టుబడులకు రాష్ట్రంలో రక్షణతో పాటు సౌకర్యాలు, రాయితీలు, నీరు, బొగ్గు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కూడా ప్రభుత్వమే కల్పిస్తోందని అన్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 22.956 కోట్లతో 429 యూనిట్లు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశామని, తద్వారా 11,099 మందికి ఉపాధి కల్పించామని చెప్పారు. టీ ఐడియా పథకం కింద 2014 నుంచి ఇప్పటివరకు 274 యూనిట్లకు 26.29 కోట్ల రాయితీలు మంజూరు చేశామన్నారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనువైన ప్రాంతమని, సింగరేణి, బీటీపీఎస్, కేటీపీఎస్, బీపీఎల్, నవభారత్ వంటి పరిశ్రమలు ఉండడం వల్లే జిల్లా అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. సీఎస్సార్ నిధులతో కూడా అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పట్టణాలు, పల్లెలు అద్భుతంగా అభివృద్ధి చెందాయన్నారు. జిల్లాలో పరిశ్రమల వల్ల వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభించాయని చెప్పారు. ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే పారిశ్రామికరంగం ముఖ్యమని, ఎన్నో పరిశ్రమలతో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని అన్నా రు. అనంతరం దళితబంధు పథకం ద్వారా యూనిట్లు ఏర్పాటు చేసిన పారిశ్రామిక వేత్తలను, పరిశ్రమల యాజమాన్యాలను సన్మానించారు. అనంతరం ఆటపాటలతో అలరించారు. ప్రభుత్వ విప్ రేగా సైతం డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సీతారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు, కేటీపీఎస్ సీఈలు ఎం.ప్రభాకర్ రావు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



గిరిజనుల సమగ్రాభివృద్ధే ధ్యేయం

కలెక్టర్ అనుదీప్, విప్ రేగా కాంతారావు

అశ్వాపురం: గిరిజనుల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ అనుదీప్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండల పరిధిలోని తుమ్మలచెరువు, వెంకటాపురం, మామిళ్లవాయి గ్రామాల్లో 653 ఎకరాల భూముల్లో 388 మంది గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టాల ఆన్‌లైన్ ప్రక్రియను మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 27, 71 సర్వే నంబర్లలో గిరిజనులకు త్వరలోనే అసైన్‌మెంట్ పట్టాలు అందజేస్తామని చెప్పారు. గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఏ.రాజు, ఆర్ఐలు రాజేశ్వరరావు, నాగమణి, జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, సర్పంచ్‌లు మడకం సాధు, బండ్ల సంధ్యారాణి, ఏనిక స్వరూప, ఎంపీటీసీ తాటి పూజిత పాల్గొన్నారు.



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, విప్ రేగా కాంతారావు

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

చుంచుపల్లి: జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటకు జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సీఈఓ విద్యాలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ కోరం కనకయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేడు సాగునీటి దినోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించే సాగు నీటి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఐడీఓసీ నుంచి మంగళవారం ఇరిగేషన్, పంచాయతీరాజ్, మత్స్య, పశు సంవర్ధక, వైద్య, రెవెన్యూ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. సాగునీటి దినోత్సవ కార్యక్రమాల పర్యవేక్షణకు అన్ని నియోజకవర్గాలకు ఇరిగేషన్ అధికారులను స్పెషలాఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల పరిధిలో జరిగే వేడుకలకు ఇరిగేషన్ ఈఈలు అర్జున్, సురేష్‌కుమార్, శ్రీనివాసాచార్యులు, వెంకటేశ్వరరావు, రాంప్రసాద్ ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తారని వివరించారు. ఇక గురువారం నిర్వహించే ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి ప్రజలు బతుకమ్మలు, బోనాలతో ఊరేగింపుగా చెరువు కట్ట వద్దకు చేరుకోవాలని కోరారు. మత్స్యకారులు వలలతో రావాలన్నారు. చెరువుకట్ట వద్ద కట్టమైసమ్మకు పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించేలా షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఏ, ఉపాధి హామీ సిబ్బంది, విద్యుత్‌శాఖ లైన్‌మెన్ పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలకు గాను 401 చోట్ల చెరువులు ఉన్నాయని, వాటిలో 50 మారుమూల గ్రామాల్లో ఉన్నాయని, అవి కాకుండా మిగితా 351 పంచాయతీల్లో వేడుకలు ఘనంగా నిర్వహించాలని చెప్పారు. వీసీలో ఇరిగేషన్ ఎస్ఈలు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, డీఆర్‌డీఓ మధుసూదన్‌రెడ్డి, డీపీఓ రమాకాంత్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఎంహెచ్ఓ శిరీష, ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు, మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన జాతీయ సంఘాల నేతలు


కేంద్ర మంత్రితో జాతీయ కార్మిక సంఘాల నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషిని జాతీయ కార్మిక సంఘాలైన హెచ్‌ఎంఎస్, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఢిల్లీలో కలిసినట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కార్మిక నాయకులతో మాట్లాడుతూ జూలై 1 నుంచి కొత్త పేస్కేల్ అమలులోకి వస్తుందని హామీ ఇచ్చారని చెప్పారు. వేజ్‌బోర్డుతోపాటు మెడికల్ అన్‌ఫిట్, మహిళా వీఆర్‌ఎస్, 2017 జనవరి నుంచి గ్రాట్యూటీ చెల్లింపు అంశాన్ని మంత్రికి వివరించినట్లు తెలిపారు. ఈ విషయమై మంత్రి సీఐఎల్ చైర్మన్ నుంచి సమాచారం తీసుకున్నారని, వీటిపై సమావేశం ఏర్పాటు చేయాలని చైర్మన్‌కు మంత్రి సూచించారని నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాథులాల్ పాండే (హెచ్‌ఎంఎస్), ఎస్క్యూ జామా (ఐఎన్‌టీయూసీ), సుధీర్‌ఘుర్డే (బీఎంఎస్), డీడీ రామానందన్ (సీఐటీయూ), హరిద్వార్‌సింగ్ (ఏఐటీయూసీ) ఉన్నారు.

కోర్టుకు హాస్టల్ భవనం కేటాయింపు


దమ్మపేట: మండల కేంద్రంలో జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేసేందుకు ఎస్సీ హాస్టల్ భవనాన్ని కేటాయిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అశ్వారావుపేట నియోజకవర్గం ప్రజలకు కోర్టు దూరంగా ఉండటంతో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గతంలో కోర్టు ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. మండల కేంద్రంలోని మల్లారంకాలనీలోని ఖాళీగా ఉన్న ఎస్సీ హాస్టల్ భవనాన్ని జిల్లా కోర్టు వారు పరిశీలించి, కోర్టు నిర్వహణకు సరిపోతుందని భావించారు. దీంతో ఎమ్మెల్యే కోర్టు నిర్వహణకు హాస్టల్ భవనం కేటాయించాలని కలెక్టర్‌ను కోరగా, మంగళవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కారులో చెలరేగిన మంటలు


కారు బానెట్ తెరుస్తున్న స్థానికులు

సత్తుపల్లిటౌన్: రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన కారులో నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కొత్తగూడెంనకు చెందిన ఎగ్గి రాజు సత్తుపల్లి వేంసూరు రోడ్డులోని ఓ హోటల్‌లో భోజనం చేసేందుకు కారును రోడ్డు పక్కన పార్క్ చేశాడు. కాసేపటికే కారులో నుంచి మంటలు, పొగ వస్తుండటంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినా అదుపు కాకపోవడంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. ఇంజన్ భాగం పూర్తిగా కాలిపోవడంతో రూ.2.90 లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని యజమాని తెలిపాడు.

మద్యం దుకాణంలో చోరీ


మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ వసంత్‌కుమార్

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఓ మద్యం దుకాణంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు, షాపు నిర్వాహకుల కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రగుంట గ్రామంలోని కార్తికేయ మద్యం దుకాణానికి సోమవారం రాత్రి నిర్వాహకులు తాళం వేసి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దుకాణం ప్రహరీ దూకి, దుకాణంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, షట్టర్ తాళాలను బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించారు. దుకాణంలోని సుమారు 52 అట్ట పెట్టెల్లోని మద్యం బాటిళ్లను అపహరించారు. ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చిన నిర్వాహకుడు చోరీ జరిగిందని గుర్తించి, స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. జూలూరుపాడు సీఐ వసంతకుమార్, ఎస్‌ఐ షాహీన, కొత్తగూడెం క్లూస్ టీం దుకాణాన్ని సందర్శించి, ఆధారాలను సేకరించారు. అపహరణకు గురైన మద్యం విలువ సుమారు రూ.3.61 లక్షలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగ్గారంలో చోరీ..

అశ్వాపురం: మండలంలోని జగ్గారం గ్రామంలో సోమవారం రాత్రి పర్శబోయిన వెంకటేశ్వర్లు ఇంట్లో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో రెండు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.50 వేల నగదు అపహరించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటు కాంగ్రెస్ .. ఇటు బీజేపీ!

ఉమ్మడి ఖమ్మంపై జాతీయ పార్టీల ఫోకస్

- 15న ఖమ్మంకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- లక్ష మందితో బహిరంగ సభకు ఏర్పాట్లు
- 25న ఖమ్మం చేరుకోనున్న భట్టి యాత్ర
- ముగింపు సభకు హాజరుకానున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాపై జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రత్యేక దృష్టి సారించాయి. వచ్చే ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఏ అవకాశాన్నీ వదులుకోకుండా జిల్లాలో వరుస కార్యక్రమాల నిర్వహణకు రెండు పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. బీజేపీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15న ఇక్కడ నిర్వహించే బహిరంగ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొననున్నారు. ఇప్పటికే ఆయన పర్యటన ఖరారు కాగా.. మరోవైపు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్ర ఈనెల 25న ఖమ్మంలో ముగియనుంది. ఈ సందర్భంగా ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరవుతారని చెబుతున్నారు. రోజుల తేడాలోనే రెండు పార్టీల జాతీయ నేతలు జిల్లాకు రానుండడంతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

రాజుకున్న రాజకీయ వేడి

జూన్ నెలలో జిల్లాలో రాజకీయ వేడి రాజుకుంది. అన్ని పార్టీలకు ఈనెల కీలకంగా మారగా.. వరుస కార్యక్రమాలపై దృష్టి సారించాయి. ఒకే నెలలో రెండు జాతీయ పార్టీల ప్రముఖ నాయకులు ఖమ్మం రానుండటం.. సభలను విజయవంతం చేసి సత్తా చాటాలని ఇరు పార్టీలు ఇప్పటి నుంచే సర్వశక్తులొడ్డుతున్నాయి. మరోవైపు ఈ నెలలోనే మరికొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయనే ఊహాగానాలు వస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రెండు ఎన్నికల్లోనూ సత్తా చాటింది. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధిక సీట్లు గెలవాలనే లక్ష్యంతో కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోంది. ఇప్పటికే పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించగా.. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ ముగింపు సభను భారీ ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మరోవైపు బీజేపీ కూడా జిల్లాలో పుంజుకునేందుకు తన ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కేంద్ర నాయకత్వం ప్రత్యేక చొరవతో ఖమ్మంలో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇక బీఆర్‌ఎస్ కూడా ఖమ్మంకు ప్రాధాన్యత ఇస్తోంది. జనవరి 18న బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ నిర్వహించడంతోపాటు పలు కార్యక్రమాల నిర్వహణకు ఖమ్మంను ఎంచుకుంది. మొత్తం మీద ఖమ్మం అన్ని పార్టీలకు కేంద్రంగా మారుతోంది.

బీజేపీ..
మహాజన సంపర్క్ అభియాన్

బీజేపీ జాతీయ నాయకత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాపై నజర్ పెట్టింది. అర్బన్ ప్రాంతాల్లోనే బీజేపీ బలంగా ఉందని.. ప్రధానంగా ఖమ్మం జిల్లాలో పార్టీ బలహీనంగా ఉందని ఇటీవల జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలనే ఉద్దేశంతో ఖమ్మం కేంద్రంగా కార్యకలాపాలను విస్తృతం చేస్తోంది. గతనెల 27న ఖమ్మంలో నిర్వహించిన నిరుద్యోగ మార్చ్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేశారు. గత మూడు నెలల క్రితం బండి సంజయ్ జిల్లాకు వచ్చారు. ఇక ఈనెల 15న ఖమ్మంలో జరిగే మహాజన్ సంపర్క్ అభియాన్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొంటారని బండి సంజయ్.. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా దాదాపు లక్ష మందితో సర్దార్ పటేల్ స్టేడియంలో భారీ సభ నిర్వహించాలని నిర్ణయించగా, ఈనెల 9న సంజయ్ ఖమ్మం వచ్చి ఏర్పాట్లపై సూచనలు చేయనున్నారు. కాగా, అమిత్‌షా వెంట కేంద్రమంత్రులు బీఎల్.వర్మ, కిషన్‌రెడ్డితోపాటు మరికొందరు మంత్రులు, అలాగే జాతీయ నేతలు హాజరవుతారని తెలిసింది. ఖమ్మంలో అమిత్ షా పాల్గొనే సభను విజయవంతం చేయడం ద్వారా పార్టీ సత్తా చాటాలనే యోచనలో పార్టీ నాయకత్వం ఉంది.

కాంగ్రెస్ 'మార్చ్'

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మార్చి 16న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం ఇచ్చోడ మండలం పిప్రి నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ మీదుగా సాగుతున్న ఆయన పాదయాత్ర మంగళవారం 82వ రోజుకు చేరింది. ఆపై నల్లగొండ, సూర్యాపేట జిల్లాల మీదుగా ఈనెల 25న ఖమ్మంకు చేరుకోనున్నారు. ఆరోజుకు పాదయాత్ర 101వ రోజులు పూర్తికానుండగా.. ముగింపు సందర్భంగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. రెండు లక్షల మందిని ఈ సభకు సమీకరించాలని టీపీసీసీ నిర్ణయించింది. సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆహ్వానించాలని పార్టీ నేతలు యోచిస్తుండగా, ఆయనతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రానున్నారు.



సాయం చేయండి..

- ఆర్థిక ఇబ్బందులతో అంతర్జాతీయ పోటీలకు వెళ్లలేని దీన స్థితి
- జాతీయస్థాయి కరాటేలో సత్తా చాటిన సౌమ్యశ్రీ
- దాతల కోసం ఎదురుచూపు

దీనగాథ


సౌమ్యశ్రీ

టేకులపల్లి: జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో విశేష ప్రతిభ చూపిన ఆదివాసీ యువతి సౌమ్యశ్రీ ఆర్థిక సమస్య కారణంగా అంతర్జాతీయ పోటీలకు వెళ్లలేక దాతల కోసం ఎదురుచూస్తోంది. టేకులపల్లి మండలం కొప్పురాయి పంచాయతీ ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన గొగ్గెల సూర్యనారాయణ – ఈశ్వరి దంపతుల కుమార్తె గొగ్గెల సౌమ్యశ్రీ దమ్మపేట మండలం అంకంపాలెం రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ప్రాథమిక విద్య ఒడ్డుగూడెంలో, బొల్లోరిగూడెం ఆశ్రమ పాఠశాలలో హైస్కూల్ విద్యాభ్యాసం చేసింది. హైస్కూల్ చదువుతున్న సమయంలో పాఠశాలలో మరియమ్మ టీచర్ ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్ కోసం బాలికలకు కరాటే నేర్పించారు. సౌమ్యశ్రీకి కరాటే పట్ల ఉన్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని మరియమ్మ పాల్వంచలోని ఎఫ్ఎస్ఎస్‌కేఏఐ మేరీ కరాటే అకాడమీ ద్వారా పోటీలకు పంపించింది. అందులో బ్రౌన్ బెల్ట్ రెండో క్యూ సాధించింది. ఆ తర్వాత ఆమె హైదరాబాద్, కర్ణాటక, గోవా, పినపాక, మణుగూరు, పస్రా తదితర ప్రాంతాల్లో జరిగిన జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని సత్తా చాటింది.


తల్లిదండ్రులతో సౌమ్యశ్రీ

తాజాగా ఈ నెల 4న కరీంనగర్‌లో జరిగిన ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఇప్పటి వరకు 11 బంగారు, 2 వెండి పతకాలు సాధించింది. ఈ నెల 22 నుంచి 25 వరకు మలేషియాలోని కౌలాలంపూర్‌లో మైలాన్ కరాటే ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ అండర్–17 విభాగంలో పాల్గొనేందుకు సౌమ్యశ్రీ ఎంపికైంది. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద స్థితి వారిది. ఈ పోటీలకు వెళ్లాలంటే సుమారు రూ.2 నుంచి 3 లక్షలు ఖర్చు అవుతుందని, అంత డబ్బు తమదగ్గర లేదని వాపోతున్నారు. దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. సాయం కోసం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఐటీడీఏ పీఓలను కలిసి తమగోడు చెప్పుకున్నారు.

ఆర్థిక సాయం చేయదలచిన వారు
జి.సూర్యనారాయణ, బ్యాంకు ఖాతా నంబర్ 7306359061–7, ఏపీజీవీబీ బొమ్మనపల్లి బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఏపీజీవీ 0004130, ఫోన్‌పే నంబర్ – 91330 10475కు ఆర్థికం సాయం చేయవచ్చు.

ముగ్గురు మావోయిస్టు కొరియర్ల అరెస్టు


కొరియర్ల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వినీత్, పక్కన అధికారులు

వివరాలు వెల్లడించిన ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు కొరియర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కొత్తగూడెంలోని కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం స్పెషల్ పార్టీ పోలీసులు, చర్ల పోలీసులు, 141 బెటాలియన్ సిబ్బంది సంయుక్తంగా మంగళవారం చర్ల మండలం దేవనగరం సమీపాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా మావోయిస్టు కొరియర్లుగా తేలింది. దీంతో చర్ల మండలం దేవనగరానికి చెందిన పూనెం బాబూరావు, ఉంజుపల్లికి చెందిన దేవనూరి మల్లికార్జున్‌రావు, బీజాపూర్ జిల్లా పామేడుకు చెందిన వల్లేపోగు ఉమాశంకర్‌ను అదుపులోకి తీసుకుని పది జిలెటిన్ స్టిక్స్, 160 మీటర్ల వైర్, ఐదు ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, ఒక డ్రోన్, ఒక లేత్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరు ముగ్గురు ఏడాది కాలంగా మావోయిస్టు పార్టీ పామేడ్ ఏరియా కమిటీ, మావోయిస్టు బెటాలియన్లకు కొరియర్లుగా పనిచేస్తూ కావాల్సిన సామగ్రిని అందజేస్తున్నారని ఎస్పీ అన్నారు. నాలుగు నెలల కిందట మావోయిస్టు నాయకుల ఆదేశాల మేరకు విజయవాడలో డ్రిల్లింగ్ మిషన్ కొనుగోలు చేసి సరఫరా చేశారని తెలిపారు. ప్రస్తుతం పేలుడు పదార్థాలను డ్రోన్‌తో పాటు ఒక లేత్ మిషన్‌ను మావోయిస్టులకు ఇచ్చేందుకు తీసుకెళ్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలు, కాంట్రాక్టర్లను బెదిరించి డబ్బు వసూలు చేస్తున్న మావోయిస్టు నేతలు విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని తెలిపారు. అంతేకాక పోలీసు బలగాలను హతమార్చాలనే ఉద్దేశంతో పేలుడు పదార్థాలను కొనుగోలు చేస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న మావోయిస్టులకు ఎవరూ సహకరించొద్దని, వారి సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని ఎస్పీ సూచించారు.

పోడు సాగుదారులందరికీ పట్టాలివ్వాలి

టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు వజ్జా సురేశ్

చండ్రుగొండ: పోడు భూములు సేద్యం చేసుకుంటున్న అందరికీ పట్టాలు పంపిణీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జా సురేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి అటవీప్రాంతంలోని ఎర్రబోడును మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గొత్తికోయలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్‌తో కలిసి ఆయన దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయాల్సి ఉండగా కేవలం 4 లక్షల ఎకరాలకే పట్టాలు పంపిణీ చేస్తామనడం ప్రభుత్వ ద్వంద్వ నీతి అని ఆయన విమర్శించారు. వలస ఆదివాసీలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఆదివాసీ గూడేలకు రోడ్డు, తాగునీరు, విద్యుత్, పాఠశాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఏజీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు మడివి రవి, బొర్రా సురేశ్, మండల నాయకులు అవులూరి రామిరెడ్డి, పెద్దిని వేణు, రాయి రాజా, కాక హనుమంతు, భీమరాజు, శంకర్, జయపాల్, రవ్వ రమేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వజ్జా సురేశ్

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు చెందిన అన్ని కుల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం చేసేందుకు సిద్ధంగా ఉందని, రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు జూన్ 2023 నాటికి 18 నుంచి 55 ఏళ్లలోపు ఉండాలని, వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు ఉండాలని, ఒక కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ రుణం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 20 వరకు tsobmmsbc. cgg. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, ఆహార భద్రతకార్డు, రెండు పాస్ ఫొటోలు జతచేయాలని, ఆన్‌లైన్ ప్రక్రియ అనంతరం పత్రాలను మున్సిపాలిటీ లేదా ఎంపీడీఓ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని కులవృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని ఇందిర ఆ ప్రకటనలో కోరారు.

పెద్దమ్మగుడి వద్ద ప్లాస్టిక్ నిషేధం

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయం పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల విక్రయాలను నిషేధించినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఈమేరకు ఆలయ పరిసరాల్లోని షాపుల్లో ఈఓ, సిబ్బంది మంగళవారం తనిఖీలు చేపట్టి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇక నుంచి అమ్మితే చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, ధర్మకర్తలు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింత నాగరాజు, గంధం వెంగళరావు, పాయం పాపయ్యదొర పాల్గొన్నారు. కాగా, పెద్దమ్మగుడి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను 9వ తేదీన లెక్కించనున్నట్లు ఈఓ తెలిపారు.

9వ తేదీన వేలంపాట

పెద్దమ్మతల్లి ఆలయం వద్ద కొబ్బరికాయల అమ్మకంతో పాటు ఇతర షాపుల నిర్వహణ అప్పగించేందుకు 9వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. కొబ్బరికాయల అమ్మకంతో పాటు చీరలు పోగు చేసుకోవడం, స్క్రాప్ తొలగింపునకు వ్యాపారులు బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు.


ఆలయం వద్ద షాపుల్లో తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఆలయంలోకి పెద్ద సంచులకు అనుమతి లేదు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోకి అనుమతి లేకుండా పెద్ద సంచులను అనుమతించేది లేదని ఆలయ ఈఓ రమాదేవి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ భద్రత దృష్ట్యా భక్తులు, వైదిక, ఆలయ అధికారులు, సిబ్బంది హ్యాండ్ బ్యాగులను మినహా మరేమి తీసుకురావొద్దని స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులు మంగళవారం నుంచి అమలులోకి వచ్చాయి. కాగా, దీని పర్యవేక్షణ బాధ్యత ఆలయ సెక్యూరిటీ అధికారులదేనని, ఏ సమయంలోనైనా ఆయా బ్యాగులను తనిఖీ చేసే అధికారం ఉందని పేర్కొన్నారు. గేట్ పాస్ లేకుండా వెళ్లే వస్తువులను ఆపి సమాచారం అందించాలని తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది భక్తుల పట్ల మర్యాదగా, సౌమ్యంగా మాట్లాడాలని, ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు.

వివాహిత ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన కోలా అఖిల (23) మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. అఖిల భర్త వెంకటేశ్వరరావు లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి దంపతులిద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురై అఖిల ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. కాగా, భర్త వెంకటేశ్వరరావు తమ కూతురుని మానసికంగా హింసించి, చంపాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. మృతురాలి తండ్రి తిరుమల్‌రావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఇల్లెందు: మండలంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన శివరాత్రి అచ్చయ్య (50)ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. గత నెల 30న తన ద్విచక్ర వాహనం మీద మహబూబాబాద్ వైపునకు వెళ్తుండగా బైపాస్‌రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన అచ్చయ్యను ఖమ్మం తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జ్వరం, కామెర్లతో బాలిక...


శివకీర్తన (ఫైల్)

కరకగూడెం: జ్వరం, కామెర్లతో బాధపడుతూ బాలిక మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన మలిపెద్ది శివకీర్తన (17) వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుంటే ఆమె తల్లిదండ్రులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో మళ్లీ జ్వరం రావడంతో స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి సోమవారం తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం బాలిక మృతి చెందింది. కాగా, బాలికకు రక్తం తక్కువగా ఉండడం, కామెర్లతో పాటు జ్వరం ఉండడంతోపాటు ఇతర అనారోగ్య సమస్యలు ఉండడమే మృతికి కారణమని పీహెచ్‌సీ వైద్యాధికారి కారం మధు తెలిపారు. శివకీర్తన అకాల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కొనసాగుతున్న దర్యాప్తు

సుజాతనగర్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సుజాతనగర్ నగల దుకాణంలో చోరీ కేసుకు సంబంధించి పోలీసులు కొంతమేర పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. చోరీ జరిగిన సమయంలో బయట కాపలాగా ఉన్న ఇద్దరు వ్యక్తుల్లో ఓ వ్యక్తి జూలూరుపాడు మండలంలోని ఓ రైస్ మిల్లు వద్ద గుర్ఖాగా పనిచేసేవ్యక్తి అని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఇతను నేపాల్‌వాసి అని పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ ఫుటేజీ చూసిన స్థానికులు ఈ వ్యక్తిని జూలూరుపాడు మండలంలోని ఓ మిల్లులో పనిచేసే గుర్ఖాగా (ఇతను కూడా పరారీలో ఉన్నాడు) గుర్తించినట్లు తెలుస్తోంది. దొంగతనానికి కొన్ని రోజుల ముందు వారికి ఈ గుర్ఖానే ఆశ్రయమిచ్చినట్లుగా విశ్వసనీయ సమాచారం. దీంతో వీరంతా ఎవరింట్లో ఉన్నారనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. స్థానికుల్లో ఎవరి ద్వారా ఈ ముఠా సుజాతనగర్‌లో గదిని అద్దెకు తీసుకున్నారో అనే అంశంపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. వివిధ కోణాల్లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ కేసుతో సంబంధం ఉన్న వారందరినీ విచారణకు పిలుస్తున్నారు. నిందితులు గతంలో ఎక్కడైనా చోరీలకు పాల్పడ్డారా? ఎవరికైనా నేర చరిత్ర ఉందా? తదితర కోణాల్లోనూ దర్యాప్తు సాగుతోంది. రెండు మూడు రోజుల్లో ఈ కేసు కొలిక్కి రావొచ్చని భావిస్తున్నారు. కాగా, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ చోరీ జరిగిన నగల దుకాణంలో మంగళవారం పరిశీలించారు.

భారీగా గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు భారీగా గంజాయి పట్టుబడింది. పోలీసుల కథనం ప్రకారం.. ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు కూనవరం రోడ్డులోని సీఆర్‌పీఎఫ్ క్యాంప్ వద్ద మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. భద్రాచలం వైపు వస్తున్న రెండు కార్లను పోలీసులు ఆపి తనిఖీ చేయబోతుండగా వారు పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వెంబడించి పట్టుకుని తనిఖీ చేశారు. ఒక్కో కార్లో 25 ప్యాకెట్లు అంటే మొత్తం 100 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెంటనే నిందితులను అదుపులోకి తీసుకుని, కార్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.రెండు కోట్లు ఉంటుందని ఏఎస్పీ తెలిపారు. సీలేరు నుంచి గంజాయి ని కొనుగోలు చేసి భద్రాచలం మీదుగా ఇతర ప్రదేశానికి తరలిస్తున్న క్రమంలో పట్టుబడ్డారని, నిందితులు ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టౌన్ సీఐ నాగరాజురెడ్డి సీఆర్పీఎఫ్ జవాన్లు, టౌన్ పోలీసులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

తెలంగాణ వర్సిటీలో విజి'లెన్స్'

- అధికారుల విస్తృత తనిఖీలు
- తెలంగాణ వర్సిటీ వీసీ పీఏ నుంచి ఫైళ్ల స్వాధీనం
- సోదాలు జరుగుతుండగా ఫైళ్లతో కారులో వెళ్లిన వీసీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ /భిక్కనూరు (కామారెడ్డి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్లర్ రవీందర్ గుప్తా, ప్రొఫెసర్ కనకయ్య హయాంలో జరిగిన అక్రమ నియామకాలు, నిధుల దుర్వినియోగం, విచ్చలవిడి కొనుగోళ్ల తదితరాల నేపథ్యంలో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం తనిఖీలు చేపట్టింది. రామచంద్రాపురం యూనిట్ (ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల పర్యవేక్షణ)కు చెందిన అదనపు ఎస్పీ ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 10 మంది సభ్యులు బృందాలుగా విడిపోయి వర్సిటీలోని ఎస్టేట్ విభాగం, ఎస్టాబ్లిష్మెంట్ విభాగం, అకౌంట్స్, ఇంజనీరింగ్, ఎగ్జామినేషన్ బ్రాంచ్, రిజిస్ట్రార్ ఆఫీస్, పర్చేజ్ కమిటీ, సర్వర్ రూమ్లలో విస్తృత సోదాలు చేశారు. వీటికి సంబంధించిన రికార్డులు, సీపీయూలు స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ సోదాలు చేశారు. బుధవారం సైతం ఈ సోదాలు ఉండనున్నట్లు తెలుస్తోంది.

వీసీ వెంటపడి వెళ్లిన విజిలెన్స్ అధికారులు

ఇదిలా ఉండగా అధికారులు తనిఖీలు ప్రారంభించిన 30 నిమిషాల తరువాత వర్సిటీలో తన చాంబర్లో ఉన్న వీసీ రవీందర్గుప్తా తన పీఏ ద్వారా కొన్ని ఫైల్స్ తెప్పించుకుని కారులో పెట్టుకుని హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. దీంతో ఒక బృందం వీసీ కారును వెంబడించి కామారెడ్డి జిల్లా భిక్కనూరు టోల్ప్లాజా వద్ద పట్టుకున్నారు. వాహనంలో ఉన్న వీసీ వద్దకు విజిలెన్స్ అధికారులు వెళ్లగా తన వాహనాన్ని ఎందుకు నిలిపారని, తనను ప్రశ్నించే అధికారం మీకు ఉందా అని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీంతో విజిలెన్స్ అధికారులు వీసీ పీఏ సవితతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఫైళ్లు తీసుకెళ్తున్న అధికారులు

టోల్ప్లాజా వద్ద విచారణ 'సీన్'

టోల్ప్లాజా కార్యాలయం గదిలో గంటకు పైగా ఆమె వద్ద ఉన్న ఫైళ్లను పరిశీలించారు. కొన్ని ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సవిత వద్ద ఫైళ్లను పరిశీలించినంత సేపూ వీసీ రవీందర్ గుప్తా తన వాహనంలోనే కూర్చున్నారు. అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయారు.

బ్యాంకు స్టేట్మెంట్లను పరిశీలిస్తాం

విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అదనపు ఎస్పీ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, బ్యాంకు స్టేట్మెంట్లు కూడా పరిశీలిస్తామని చెప్పారు

రెండో విడత పంట నష్టపరిహారానికి
రూ. 230 కోట్లు

- 2.30 లక్షల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం
- ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ తుది నివేదిక
- త్వరలో రైతుల ఖాతాలో జమ చేసేందుకు ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: గత ఏప్రిల్ నెలలో రెండో విడత వడగళ్లు, భారీ వర్షాలకు జరిగిన పంట నష్టానికి రైతులకు రూ. 230 కోట్లు పరిహారంగా ఇవ్వాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. వివిధ జిల్లాల్లో 2.30 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని నిర్ధారించి, ప్రభుత్వానికి వ్యవసాయశాఖ తుది నివేదిక ఇచ్చింది. నిధులను త్వరలో విడుదల చేసి రైతులకు అందజేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు వ్యవసాయ వర్గాలు వెల్లడించాయి.

మొదటి విడతలో రూ. 151 కోట్లు..

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో రెండుసార్లు వడగళ్లు, భారీ వర్షాలకు లక్షలాది ఎకరాల్లోని యాసంగి సీజన్ పంటకు నష్టం జరిగిన సంగతి తెలిసిందే. వరి, మొక్కజొన్న, మామిడి తదితర పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. మార్చి నెలలో కురిసిన వడగళ్లు, వర్షాలకు 1.51 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. నష్టం జరిగిన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయానా పర్యటించి, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ప్రకటించిన విషయం విదితమే. ఆ మేరకు ప్రభుత్వం రూ. 151 కోట్లు పరిహారం మంజూరు చేసింది. ఆ పరిహారం రైతుల ఖాతాల్లో ఇంకా పూర్తిస్థాయిలో పడలేదని, ప్రక్రియ కొనసాగుతుందని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి.

ఒక విపత్తు నష్టానికే..: ఈ ఏడాది విపత్తు కారణంగా రెండుసార్లు పంటలకు నష్టం వాటిల్లింది. రెండు విడతల్లో పంట నష్టం జరిగిన రైతులకు ఒక్కదానికి మాత్రమే పరిహారం ఇవ్వాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. నష్టపోయిన ప్రతి రైతు ఒకే వ్యవసాయ సీజన్లో ఒక విపత్తుకు మాత్రమే ఇన్పుట్ సబ్సిడీకి అర్హులని స్పష్టం చేసింది. అంటే మొదటి విడత ఒక రైతుకు ఒక ఎకరాలో పంట నష్టం జరిగి పరిహారం ప్రకటిస్తే, అదే రైతుకు ఏప్రిల్లోని విపత్తుకు మరో ఎకరాలో నష్టం జరిగితే దాన్ని పరిగణలోకి తీసుకోరు. ఒక రైతుకు వేర్వేరు చోట్ల ఉన్న వ్యవసాయ పంటలకు పూర్తి నష్టం జరిగితే ఒకదాన్నే ఎలా గుర్తిస్తారన్న విమర్శలున్నాయి. దీనిపై నిర్ణయం తీసుకోవడంలో వ్యవసాయశాఖ విఫలమైందన్న చర్చా జరుగుతోంది. కాగా, ఇన్పుట్ సబ్సిడీ చెల్లింపు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని వ్యవసాయశాఖ పేర్కొంది. వీటిని వీలైనంత వరకు ఆధార్తో అనుసంధానం చేయాలని ఆదేశించింది.

పూర్తి కాని కొనుగోళ్లు..
ఆందోళనలో రైతన్నలు

- ఏడువేల కొనుగోలు కేంద్రాల్లో మూడువేలు మూసివేత
- ఇంకా చాలా జిల్లాల్లో చివరి దశలో కొనుగోళ్లు
- 57 లక్షల ఎంటీల ధాన్యం సేకరణ.. మరో 4.55 లక్షల ఎంటీల సేకరణ లక్ష్యం
- సమీపిస్తున్న రుతుపవనాలు, మొదలైన ఏరువాక



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వం తలపెట్టిన ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తి కాకపోవడం రైతులను కలవరపెడుతోంది. చాలా జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇంకా అమ్ముడుకాకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. ఓవైపు రుతుపవనాలు సమీపిస్తుండటం, రబీ సీజన్ మొదలవుతుండటం.. ఇంకోవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇంకా అమ్ముడుపోకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు.. మిల్లర్లు కుమ్మక్కై చాలాచోట్ల క్వింటాలుకు 9 నుంచి 11 కిలోల వరకు కోత పెడుతున్నారు. అయినా సరే రైతులు కోతలకు సమ్మతించినా.. మిల్లర్లు చాలాచోట్ల కొర్రీలు పెడుతుండటం, ధాన్యాన్ని మిల్లుల్లో దింపకుండా అలాగే ఉంచడంతో లారీలు కొనుగోలు కేంద్రాలకు సరిగా వెళ్లడం లేదు. దీంతో కొనుగోళ్లలో తీవ్ర జాప్యం నెలకొంటోంది.


మరో 4.55 లక్షల మెట్రిక్ టన్నుల దూరంలో..

ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 62.16 లక్షల మెట్రిక్ టన్నుల (ఎంటీలు) ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 7,192 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. జూన్ 6 నాటికి అందులో 3,181 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయింది. కానీ, మధ్యలో మిల్లర్ల కొర్రీలు, అకాల వర్షాలు, లారీల కొరత తదితర కారణాల వల్ల ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు 57.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, మరో 4.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన ధాన్యం విలువ రూ.11,843 కోట్లుగా ఉంది.

ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా?

ఏరువాక ఉత్సవాలతో రబీ సీజన్ మొదలైంది. ఈసారి రబీని నవంబరు నాటికి పూర్తి చేసి, యాసంగి పంట కోతలను మార్చి నాటికి ముగించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈసారి వేసవిలో అకాల వర్షాలు రైతులకు గత వందేళ్లలో ఏనాడూ చూడని నష్టాన్ని కలగజేశాయి. దీనికి తోడు వేసవిలో కోతలు ఏప్రిల్ వరకు సాగితే, వరి నుంచి మర ఆడిస్తే నూక అధికంగా వస్తుంది. ఈ సమస్యలను అధిగమించి మార్చి నాటికి కోతలను ముగిస్తే.. రైతుకు ప్రకృతి విపత్తులు, నూకల బెడద తప్పుతుందన్నది ప్రభుత్వ వ్యూహం. కానీ, కొనుగోళ్ల ప్రక్రియ జాప్యమవడంతో రబీ, యాసంగి సీజన్ల పంట ఆలస్యమయ్యే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజుల్లో పూర్తి



మరో మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం. ఎక్కడా రైతులకు ఇబ్బంది రానీయం. 95% ధాన్యం కొనుగోలు చేశాం. త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు కూడా జమవుతాయి.

–మంత్రి గంగుల కమలాకర్

కొనుగోళ్ల వేగం పెంచాం



రాష్ట్రంలో కొనుగోళ్ల ప్రక్రియ వేగం పుంజుకుంది. మంగళవారం ఒక్కరోజే 1,31,703 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడమే ఇందుకు నిదర్శనం. అకాల వర్షాలు, సాంకేతిక సమస్యల కారణంగా కొంచెం జాప్యమైన మాట వాస్తవమే. రెండు మూడు రోజుల్లో మిగిలిన 4.55 లక్షల మెట్రిక్ టన్నులు సైతం కొనేస్తాం.

–సర్దార్ రవీందర్ సింగ్, పౌరసరఫరాల శాఖ, చైర్మన్

కాంటా వేసి పదిహేను రోజులు



కొనుగోలు కేంద్రంలో 400 బస్తాలు కాంటా వేసి, 15 రోజులైతంది. లారీలు రాకపోవడంతో, బస్తాలు కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. వానలు పడుతుండటంతో తడుస్తయేమో అని భయంగా ఉంది. బస్తాలు తడవకుండా కవర్లు కప్పి ఉంచిన. ఇక్కడే కాపలా ఉంటున్న. లారీలు పంపి బస్తాలను మిల్లులకు తీసుకుపోవాలి. – కొట్టె అంజన్న, తాళ్లపేట, దండేపల్లి, మంచిర్యాల

నెలరోజులు గడుస్తున్నా..



గాధిర్యాల్ కేంద్రంలో ధాన్యం సేకరణ ఆలస్యంగా జరుగుతోంది. ధాన్యాన్ని కేంద్రానికి తెచ్చి నెల రోజులు దాటినా తూకం వేయలేదు. దీంతో నిత్యం వానలతో అవస్థలు పడుతున్నాం. రోజుకింత తడిసినప్పుడల్లా ధాన్యం మొలకెత్తుతోంది. 400 బస్తాల వరకు ధాన్యం ఉంది. ఇప్పటికైనా త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలి. –కుర్వ భీరతయ్య, రైతు గాధిర్యాల్, మహబూబ్నగర్

అడ్వాన్స్డ్లో 'వాట్సాప్ కాపీయింగ్'

▶ మొదటి పేజీ తరువాయి

ఎల్బీనగర్లోని కళాశాలల్లో సెంటర్లు పడ్డాయి. అయితే తన సోదరుడితో పాటు స్నేహితులకు కూడా మంచి మార్కులు రప్పించాలని భావించిన కడప విద్యార్థి ఐదుగురితో ఓ వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాడు. కళాశాలల్లో తనిఖీ చేసే సిబ్బంది కళ్లుగప్పిన ఈ ఐదుగురూ పరీక్ష కేంద్రాల్లోకి తమ స్మార్ట్ఫోన్లు తీసుకువెళ్లారు.

కంప్యూటర్ స్క్రీన్ ఫొటోలు తీసి..

ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షను అభ్యర్థులు ఆన్లైన్లో రాయాల్సి ఉంటుంది. కంప్యూటర్లో ఒక ప్రశ్న తర్వాత మరో ప్రశ్న ప్రత్యక్షమవుతూ ఉంటే.. విద్యార్థులు జవాబులు టిక్ చేస్తూ పోతుంటారు. కడప విద్యార్థి కంప్యూటర్ స్క్రీన్పై తాను టిక్ చేసిన ప్రతి జవాబును ప్రశ్నతో సహా కనిపించేలా స్మార్ట్ఫోన్లో ఫొటోలు తీసి, వాట్సాప్ గ్రూప్లో పోస్టు చేయడం ద్వారా మిగిలిన నలుగురికీ చేరేలా చేశాడు. ఎస్వీఐటీ కాలేజీలో పరీక్ష హాలు పెద్దదిగా ఉండటం, ఇన్విజిలేటర్ విధుల్లో ఉన్న సిబ్బంది ఒకేచోట కూర్చుండిపోవడంతో గంటన్నర పాటు ఈ తతంగాన్ని ఎవరూ గుర్తించలేదు. 10.30 గంటల సమయంలో మల్లాపూర్ కేంద్రంలో ఇన్విజిలేటర్ అక్కడి విద్యార్థి వద్ద స్మార్ట్ఫోన్ ఉండటాన్ని గమనించారు. అందులో ఉన్న వాట్సాప్ గ్రూపులో కంప్యూటర్ స్క్రీన్ ఫొటోలను చూసిన ఆయన సదరు విద్యార్థిని ప్రశ్నించగా విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్వీఐటీ కాలేజీ పరీక్ష కేంద్రంలోని కడప విద్యార్థి నుంచి ఈ ఫొటోలు వస్తున్నట్లు తెలుసుకుని ఆ సెంటర్ అధికారికి సమాచారమిచ్చారు. ఆయన కేంద్రంలోకి వెళ్లి కడప విద్యార్థిని తనిఖీ చేయగా అతడి వద్ద స్మార్ట్ఫోన్ లభించింది. ఇదే క్రమంలో మౌలాలి, ఎల్బీనగర్లోని కేంద్రాల్లో పరీక్ష రాస్తున్న మరో ముగ్గురినీ పట్టుకున్నారు. ఈ ఐదుగురూ ఐఐటీ–హైదరాబాద్ తరఫున జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షలు నిర్వహిస్తున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఐఓఎన్ సంస్థకు క్షమాపణ పత్రాలు రాసి ఇచ్చారు. సంస్థ సిబ్బంది ఆదివారం రాత్రి మార్కెట్, మల్కాజ్గిరి, ఎల్బీనగర్, నాచారం పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేయగా మంగళవారం వెలుగులోకి వచ్చింది.

నిర్వహణ సంస్థ నిర్లక్ష్యం?

విద్యార్థులపై పోలీసులు ఐపీసీ 188, 420తో పాటు తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్లోని 4 (బీ), 8 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఐదుగురి ఫోన్లనూ స్వాధీనం చేసుకున్నారు. ఈ పరీక్ష నిర్వహిస్తున్న ప్రైవేట్ సంస్థ నిర్లక్ష్యంతోనే స్మార్ట్ ఫోన్లు పరీక్ష కేంద్రంలోకి వెళ్లాయని చెప్తున్నారు. నాలుగు పరీక్ష కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లకూ నోటీసులు ఇచ్చి విచారించడంతో పాటు వాంగ్మూలం నమోదు చేయాలని భావిస్తున్నారు.

బీఆర్ఎస్.. విద్యుత్ ఉత్పత్తి పెంచలేదు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. సీఎం కేసీఆర్ ఇస్తున్నది ఉచిత విద్యుత్ కాదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏడాదికి ఒక హార్స్పవర్కి రూ.20 చార్జ్ (ఏడు గంటల కరెంట్ సరఫరాకు) చేశారని, కేసీఆర్ మాత్రం సర్చార్జ్ పేరుతో ఒక హెచ్పీకి రూ.20 వసూలుతో పాటు, ఇంటికి వాడే కరెంటుకూ సర్చార్జీలను వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు 24గంటల కరెంట్ ఇవ్వడం లేదన్నారు. ఉచిత విద్యుత్కు డబ్బు ఎవరు ఇస్తున్నారు? ఎక్కడ నుంచి వస్తుందో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టుల నుంచి వస్తున్న విద్యుతే ఇప్పుడు సరఫరా చేస్తున్నారన్నారు. ఛత్తీస్గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందం మేరకు డబ్బు ఇవ్వకపోవడంతో ఆ రాష్ట్రం తెలంగాణపై కేసు వేసిందని చెప్పారు.

జిల్లా వార్తలు

కిన్నెరసానిని సందర్శించిన ఒంగోలు జడ్జి



బోటు షికారు చేస్తున్న జడ్జి, కుటుంబసభ్యులు

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని ఏపీలోని ఒంగోలు జిల్లా జడ్జి టి.రాజ వెంకటాద్రి కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం సందర్శించారు. డీర్ పార్క్లో దుప్పులను, డక్ ఫాండ్లో బాతులను, జలాశయాన్ని వీక్షించారు. అనంతరం రిజర్వాయర్లో బోటు షికారు చేశారు. ఆయన వెంట వైల్డ్లైఫ్ సిబ్బంది, పలువురు న్యాయవాదులు ఉన్నారు.

పామాయిల్ రైతుల సమస్యలపై వినతి



ఆయిల్ఫెడ్ ఎండీకి వినతిపత్రం ఇస్తున్న సంఘం బాధ్యులు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్పామ్ సాగు చేస్తున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పామాయిల్ రైతు సంఘం ఆధ్వర్యాన ఆయిల్ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎండీ సురేందర్రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో ఆయిల్ఫెడ్, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యాన 95 వేల ఎకరాల్లో పంట సాగవుతుండగా, దాదాపు 25 వేల మంది రైతులు ఆధారపడ్డారని తెలిపారు. పంట సాగుపై దృష్టి సారిస్తున్నప్పటికీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం జరుగుతోందని చెప్పారు. మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ జారీ చేసిన జీఓను తెలంగాణ రైతులకు వర్తింపజేయొద్దని, పామాయిల్పై దిగుమతి సుంకం 15 శాతానికి పైగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, పామాయిల్ గెలల ధర తగ్గుదల ప్రభావం రైతులపై పడకుండా టన్ను ధర రూ.20 వేలకు తగ్గకుండా పర్యవేక్షించాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగాన్ని పెంచేది ఆర్థిక విధానాలే

- యువతను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతున్న యూనివర్సిటీలు
- లాభాలు ఆర్జించటమే ధ్యేయంగా పెట్టుబడిదారీ వ్యవస్థ
- పీవైఎల్ రాష్ట్ర మహాసభల్లో సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ



పీవైఎల్ రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: కళాశాలలు, యూనివర్సిటీల్లో విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతుండగా.. ప్రభుత్వాల విధానాలతో నిరుద్యోగం పెరుగుతోందని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఖమ్మంలో జరుగుతున్న పీవైఎల్ రాష్ట్ర రెండో మహాసభల్లో భాగంగా మంగళవారం భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభలో లక్ష్మీనారాయణ ప్రారంభోపన్యాసం చేస్తూ దోపిడీదారులకు అనుకూలమైన విధానాలను రూపొందించడం ద్వారా శ్రమదోపిడీ, నిరుద్యోగం పెరుగుతున్నాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో వామపక్ష పార్టీలు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఉద్యమ సమయంలో ఈ విషయాన్ని అంగీకరించిన సీఎం కేసీఆర్.. రాష్ట్రంలో 1.07 లక్షల ఉద్యోగాలు ఖాళీలున్నాయని చెప్పినా వాటి భర్తీకి చొరవ తీసుకోవడం లేదన్నారు. యూనివర్సిటీలు నిరుద్యోగుల్ని తయారు చేస్తున్నాయనే ప్రచారంలో వాస్తవంలేదని స్పష్టం చేశారు. ఇక్కడ ఉన్న పరిశ్రమలను మూసివేయించి అమెరికా వెళ్లి పరిశ్రమలు తెస్తానని మంత్రులు చెప్పడం యువతను తప్పుదోవ పట్టించడమేనని తెలిపారు. కార్పొరేట్, మతతత్వ శక్తులు దేశాన్ని పాలిస్తుండగా.. యువతకు కావాల్సిన మేరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడం లేదని లక్ష్మీనారాయణ తెలిపారు. విద్య, వైద్యం, నీళ్ల అమ్మకం ద్వారా ప్రజల డబ్బును కార్పొరేట్శక్తులు లాక్కుంటున్నాయని.. అదే ప్రజల మధ్య డబ్బు ఉంటే ఆర్థిక మాంద్యం మాటే ఉండదని పేర్కొన్నారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోవర్ధన్ మాట్లాడగా అరుణోదయ కళాకారులు పాడిన గేయాలు ఆకట్టుకున్నాయి. పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబు మాట్లాడుతూ మహాసభలు విజయవంతానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బాబూరావు, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు నాగమణితో పాటు వీరమోకాళ్ల రమేశ్కుమారి, రణధీర్, ఎం.గిరి, శోభారాణి, సురేశ్, హన్మంతరావు, నలగాటి వీరేందర్ తదితరులు మాట్లాడారు.

నారాయణపురంలో ఆధ్యాత్మిక శోభ




బొడ్రాయి ప్రతిష్ఠాపన సందర్భంగా బోనాలు, హోమం

బోనాలతో బారులుదీరిన మహిళలు (ఇన్సెట్) హోమంలో పాల్గొన్న భక్తులు

సత్తుపల్లి: మండలంలోని నారాయణపురం మంగళవారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్థానికంగా అభయాంజనేయస్వామి, ముత్యాలమ్మ తల్లి, బొడ్రాయి ప్రతిష్ఠాపన సందర్భంగా హోమం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో బొడ్రాయి నుంచి అభయాంజనేయస్వామి ఆలయం ప్రాంగణానికి తరలివచ్చారు. ఈ నెల 8న జరిగే ప్రతిష్ఠా మహోత్సవానికి ఎంపీలు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ దేశిరెడ్డి రంగారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మందపాటి వెంకటరెడ్డితో పాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బేతిని శ్రీనివాసరావు, గోగులమూడి బాలాజీరెడ్డి, మందపాటి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తానా సభలకు ఆహ్వానం



రావూరి సైదబాబు

ఖమ్మంఅర్బన్: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) 23వ సదస్సులో పాల్గొనాల్సిందిగా ఖమ్మానికి చెందిన రావూరి ఈవెంట్స్, ప్లానర్స్ చైర్మన్ రావూరి సైదబాబుకు ఆహ్వానం అందింది. వచ్చే 7 నుంచి అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఈ సభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా తానా అధ్యక్షుడు అంజయ్య చౌదరి, సదస్సు సమన్వయకర్త పొట్లూరి రవి ఆహ్వాన పత్రిక పంపారని అల్లీపురానికి చెందిన సైదుబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సింగరేణి యాజమాన్యంతో నేడు కార్మిక సంఘాల భేటీ

సూపర్బజార్(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం, సీఎంపీఎఫ్ అధికారులతో బుధవారం జాతీయ కార్మిక సంఘాల నాయకులు సమావేశం కానున్నారు. కాంట్రాక్టు, పర్మనెంట్ కార్మికుల పెన్షన్ సీఎంపీఎఫ్ సమస్యలపై గోదావరిఖని ఏరియా ఇల్లెందు క్లబ్లో ఈ సమావేశం జరగనుంది. పెన్షన్ సీఎంపీఎఫ్ సమస్యలతో పాటు ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్న ఈ సమావేశంలో సీఎంపీఎఫ్ కమిషనర్తోపాటు సింగరేణి డైరెక్టర్లు, ఐదు జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొననున్నారు.

22 కాంట్రాక్టులు ఒకరికే ఎలా ఇస్తారు?

మేం చెప్పే వరకు బిల్లులు చెల్లించొద్దు : హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్అండ్బీ, పంచాయతీరాజ్ శాఖలు ఒకే కాంట్రాక్టర్కు నామినేషన్ ప్రాతిపదికన 22 పనులు అప్పగించడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. కాంట్రాక్టులను అలా ఎలా అప్పగిస్తారని ప్రశ్నించింది. తాము ఉత్తర్వులు ఇచ్చేవరకు సదరు కాంట్రాక్టర్కు బిల్లులు చెల్లించొద్దని ఆదేశించింది. అంతేకాక పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన అధికారులు, ఎంఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్కు నోటీసులు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఒకరికే 22 కాంట్రాక్టులు అప్పగించిన అధికారుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఖమ్మం జిల్లాకు చెందిన రాంబాబు ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఆర్అండ్బీ, పంచాయతీరాజ్ అధికారులు అప్పగించిన పనుల్లో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండానే ఎంఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ పనులు నిర్వహిస్తోందని పిటిషనర్ పేర్కొన్నారు. పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేకుండా అటవీప్రాంతంలో రోడ్లు, వంతెనలు నిర్మిస్తోందన్నారు. అయితే, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిశీలించాకే కాంట్రాక్టుల అప్పగింత జరిగిందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎ.సంజీవ్కుమార్ తెలిపారు. ఇరువర్గాల వాదనలను విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 25వ తేదీకి వాయిదా వేసింది.

వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలి

ఆయిల్ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్రెడ్డి



దమ్మపేట ఫ్యాక్టరీలో సూచనలిస్తున్న జీఎం సుధాకర్రెడ్డి

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: సంస్థ నిర్దేశించిన ఆయిల్ ఇయర్ లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలని ఆయిల్ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్రెడ్డి సూచించారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం వద్ద పామాయిల్ నర్సరీలో మొక్కలు, బీ–బ్లాక్లో నిర్మిస్తున్న అతిథి భవన నిర్మాణ పనులతో పాటు దమ్మపేట మండలం అప్పారావుపేట వద్ద పామాయిల్ ఫ్యాక్టరీలో విస్తరణ పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీల్లో గెలల క్రషింగ్, గెలల నిల్వలపై ఆరా తీసిన ఆయన పామాయిల్ మొక్కల పంపిణీపై సూచనలు చేశారు. వర్షాలు మొదలుకాగానే మొక్కల పంపిణీ చేపట్టాలని తెలిపారు. కాగా, అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని 60 టన్నుల నుంచి 90 టన్నుల సామర్థ్యానికి పెంచేలా విస్తరిస్తుండగా నూతన యంత్రాలు, బాయిలర్ను పరిశీలించిన సుధాకర్రెడ్డి సెప్టెంబర్ కల్లా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్లాంట్స్ అండ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్లు ఆకుల బాలకృష్ణ, కల్యాణ్గౌడ్, వెంకటేశ్, నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బెస్ట్ పోస్టల్ డివిజన్గా ఖమ్మంకు అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ రవికుమార్, హెడ్ పోస్టాఫీస్ పోస్ట్మాస్టర్ కిరణ్కుమార్రెడ్డి

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ తపాలా సర్కిల్ స్థాయిలో అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రగతి సాధించిన ఖమ్మం తపాలా డివిజన్కు బెస్ట్ పోస్టల్ డివిజన్ అవార్డు దక్కింది. దీంతో పాటు ఇతర విభాగాల్లో మరో మూడు అవార్డులు వచ్చాయి. హైదరాబాద్లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులకు చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్, పోస్ట్మాస్టర్ జనరల్ పీవీఎస్.రెడ్డి, పోస్టుమాస్టర్ జనరల్ టీఎం .శ్రీలత అవార్డులు అందజేశారు. బెస్ట్ డివిజన్ అవార్డును పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్, సర్కిల్ పరిధిలో స్పీడ్ పోస్టు బెస్ట్ మెయిల్ డెలివరీ అవార్డును ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ పోస్ట్మాస్టర్ కె కిరణ్కుమార్రెడ్డి, బ్రాంచ్ పోస్టాఫీసుల్లో అత్యధిక అకౌంట్లు తెరిపించిన కూసుమంచి మండలం జక్కేపల్లి పోస్ట్మాస్టర్ కె.సోమయ్య అవార్డులు అందుకోగా, జిల్లా ఉద్యోగులు అభినందించారు.